క్లుప్తంగా

ఘనంగా వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు రేపు

సత్తెనపల్లి: జన హృదయ నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం కోరారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 8న ఉదయం 9 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం తాలూకా సెంటర్, గ్రంథాలయం, రైల్వే గేటు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని తెలిపారు. కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పూర్వ వలంటీర్లు, సోషల్ మీడియా సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకూరపాడు: స్థానిక ఆర్సీఎం పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో కొమరాబత్తిన రోజా నమ్మ, నారంశెట్టి జయరావు జ్ఞాపకార్థం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కె.ఎల్.రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



యడ్లపాడు: బైక్ అదుపు తప్పి ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికీ గాయాలైన ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యడ్లపాడు చెందిన పి.సతీష్‌బాబు, షేక్ చాన్‌షా బైక్‌పై సర్వీసు మార్గంలో యడ్లపాడు వైపు వస్తుండగా అదుపు తప్పింది. దీంతో అదే మార్గంలో వెళ్తున్న టాటా ఎస్ వాహనాన్ని బైక్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్‌బాబు, చాన్‌షా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లోంచి రూ.35 వేల నగదు, ఏటీఎం కార్డు కింద పడిపోయాయి. స్థానికుల సమాచారంతో రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో లభించిన నగదు, ఏటీఎంలను పోలీసులకు అప్పగించారు.

కోదండ రాముడికి జన్మనక్షత్ర పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు దర్శి ఉమామహేశ్వరశర్మ, అనిల్ కుమార్‌లు స్వామివార్లను జలాభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు గోత్రనామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం



రొంపిచర్ల: విద్యుదాఘాతంతో గృహంలోని వస్తువులన్నీ దగ్ధమైన సంఘటన మండలంలోని అన్నవరప్పాడు కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఎం.చినకోటేశ్వరరావు కుటుంబ సభ్యులు రాత్రి వేళ ఇంటిలో నిద్రిస్తున్నారు. నిద్రిస్తున్న సమయంలో గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వచ్చాయి. మంటలు రావటంతో నిద్రిస్తున్నవారంతా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గృహంలోని విలువైన వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధిద్దాం

వాడవాడలా జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాలు



సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళి

సత్తెనపల్లి: దేశ తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను సాధిద్దామని వ్యవసాయ మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్ పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, మాజీ భారత ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో దళిత నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లను సమర్థవంతంగా అన్ని శాఖల్లో అమలు చేసి అట్టడుగులో వర్గాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఘనత బాబు జగ్జీవన్ రామ్‌కే దక్కిందన్నారు. అమరావతి బస్సు పాయింట్, ఇతర ప్రాంతాల్లోని జగ్జీవన్ రామ్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృపావరం, సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్, యాసారపు బాబు, సతీష్, చంటి, ఆనంద్, వెంకటేశ్వర్లు, శివన్నారాయణ, మల్లికార్జున్ రెడ్డి, నరసింహారావు, వెంకటేశ్వర్లు, చెంచిరెడ్డి, లక్ష్మీనారాయణ, మోషే, మాధవ్, ఏసుబాబు, వెంకటేశ్వర్లు (బుల్లోడు), బుల్లిబాబు, కొటేస్వరరావు, ఏడుకొండలు, చంటి, రాము పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనించాలి

మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనించాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజుపాల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, సబ్ రిజిస్టర్ ఆఫీస్ వెనుక ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రమం వద్ద శనివారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ నాయకులు షేక్ చాంద్ బాషా, కోట ఆనంద్, శంకర్రావు, మోహన్‌రావు, సాంబ శివరావు, గాంద్ల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాది, ఉపాధ్యాయుల నివాళి

మహనీయుడు జగ్జీవన్‌రామ్

నకరికల్లు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని సీనియర్ న్యాయవాది జి.కన్నారావు కొనియాడారు. కండ్లకుంట గ్రామంలోని పాఠశాలలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం రత్నకుమారి, లింగయ్య, పమిడి రామయ్య, శ్రీను, చంటి, దినేష్, ఏసుదాసు, ఉపాధ్యాయులు విశ్వేశ్వరరావు, పూర్ణయ్య పాల్గొన్నారు.



అమరావతి బస్టాప్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకుల నివాళి

స్వర్ణకార సంఘం లెటర్ ప్యాడ్‌ల దుర్వినియోగంపై చర్యలు



సంఘ అధ్యక్షుడు వెంకట్, సంఘ బాధ్యులు

సత్తెనపల్లి: స్వర్ణకార సంఘం లెటర్ ప్యాడ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని వీరబ్రహ్మేంద్ర స్వర్ణకార సంఘం పట్టణాధ్యక్షుడు దాచేపల్లి వెంకట్ తెలిపారు. వేదా కళాశాల ఆడిటోరియంలో శనివారం పట్టణ స్వర్ణకార సంఘం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కొందరు సంఘం లెటర్ ప్యాడ్లను వినియోగించుకొని బ్యాంకుల్లో అప్రైజర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. తమ సంఘం ద్వారా సిఫార్సు లేఖలను ఎవరికి ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకులను మోసం చేస్తూ.. లెటర్ ప్యాడ్‌లను అక్రమంగా వినియోగించుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై ఇప్పటికే అన్ని బ్యాంకు శాఖలకు సమాచారం అందించామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతమైతే.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. సంఘ పూర్వ అధ్యక్షుడు కోనపర్తి యుగంధర్, సంఘ బాధ్యులు బంగారు లక్ష్మణాచారి, కాకుమాను మధు, తంగెళ్లపల్లి గురు భూషనాచారి, షేక్ మీరావలి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ జగదీష్, వైస్ ఎంపీపీ

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అన్నదాసు శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీఓ ఎస్.జగదీష్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు తమ హక్కుల సాధనకు సభలు, సమావేశాలు దోహదపడతాయన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రులు



వారాహి మాత దర్శనం



కుంకుమార్చనలో మహిళలు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో శనివారం వారాహి నవరాత్రుల పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గా మాతని వారాహి మాత అలంకరణలో లలిత సహస్ర నామ స్తోత్రం, అష్టోత్తర శతనామాలు, ద్వాదశ నామాలు, గాయత్రీ మంత్రంతో కుంకుమార్చన నిర్వహించారు. ప్రత్యేకంగా నైవేద్యాలు, మంత్ర పుష్పం, హారతులు అందించారు. కుంకుమ పూజలో పాల్గొన్న మహిళా భక్తులకు శ్రీ చక్ర మేరువ అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పురుగు మందుల విక్రయం నిలిపివేత



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ముప్పాళ్ళ: నాణ్యత లోపించిన వ్యవసాయ వనరులను రైతులకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ కార్యాలయ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని విత్తనాల, ఎరువుల విక్రయాల దుకాణాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన డీలర్లు సరైన పత్రాలు లేకుండా విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.3,28,702లు విలువ గల 246 లీటర్ల పురుగు మందులను, ఫాం–ఓ లేని రూ.2,59,050లు విలువ గల ఎరువుల నిల్వల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రవికుమార్, సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఏడీఏ ఎస్.శ్రీధర్‌రెడ్డి, లైజినింగ్ ఆఫీసర్స్ ఏఓ ప్రవీణ్, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే కుటుంబ అభివృద్ధి

మాచర్ల రూరల్ : బడి ఈడు పిల్లలందర్ని పాఠశాలల్లో చేర్చి వారి కుటుంబ అభివృద్ధికి దోహదపడాలనే ప్రభుత్వ లక్ష్యానికి ప్రజలందరూ సహకరించాలని హెచ్‌ఎం ఐవీ నాగమణి కోరారు. శనివారం మండలంలోని కొప్పునూరు గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య ద్వారానే కుటుంబ ఆర్థిక పరిస్థితిలో మార్పు వస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధన, డిజిటల్ వసతులు, ఉచితంగా పౌష్టికాహారం, దుస్తులు, పుస్తకాలు, బెల్టు, టై వంటివి అందిస్తున్నామని చెప్పారు. ర్యాలీ తర్వాత మానవహారం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు పాల్‌రాజ్, అప్పారావు, శ్రీనివాసరావు, మధుబాబు, పెద యాసోబు, నారాయణ, ప్రసాదరావు విద్యార్థులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ అన్నవరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బడిబయట పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. డ్రాప్ అవుట్స్ విద్యార్థులను ఇళ్లకు వెళ్లి బడిలో చేర్పించారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాస రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణ శ్రీ, పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి

సత్తెనపల్లి: పట్టణంలో పురపాలక సంఘ కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్న మంచి నీటిని వర్షాకాలం దృష్ట్యా కాచి, చల్లార్చి వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీటి సరఫరాలో ఎటువంటి సమస్య ఉన్నా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

పురుగు మందుల దుకాణాలపై ఆకస్మిక దాడులు

- పత్రాలు చూపని ఎరువులు, పురుగు మందుల విక్రయాలు నిలిపివేత
- ఒక దుకాణం లైసెన్సు రద్దుకు సిఫారసు



ఎరువుల దుకాణంలో పత్రాలు తనిఖీ చేస్తున్న వ్యవసాయ విజిలెన్స్ అధికారులు

క్రోసూరు: మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో విజయవాడ ఏడీఏ బి.వేంకటేశ్వరరావు, విశాఖపట్నం ఎస్‌ఐ డి.రవికుమార్, ఏవో వి.వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రోసూరులోని శ్రీపవన్ ఫర్టిలైజర్స్ షాపులో ఎరువుల లైసెన్సు ఫారం (ఓ)లేనందున రూ.44వేలు విలువగల ఎరువుల విక్రయాలు నిలిపివేసినట్లు తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో సర్టిఫికెట్స్ లేని కారణంగా బయో స్టిములేంట్స్ 65 లీటర్లు (రూ.53వేలు) విక్రయాలు నిలిపివేసినట్లు చెప్పారు. ఇదే షాపు నందు గడువు తేదీ ముగిసిన పురుగు మందుల నిల్వలు ఉండటంతో లైసెన్సు రద్దు చేయాలని సిఫారుసు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించే ఉద్దేశంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైరస్‌లను తట్టుకునే విత్తనాలు వాడాలి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో పత్తి, మిరప పంటలను సాగు చేసే రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ఎంతో అవసరమని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సూచించారు. వైరస్ తెగుళ్లను తట్టుకునే రకాలకు చెందిన కంపెనీ విత్తనాలు వాడాలని కోరారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్న రైతులు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఎక్కువగా గులాబీ రంగు పురుగు తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఈ పురుగు నివారణకు పిచికారీ మందులను వాడుకోవాలని తెలిపారు. మిరపను సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్టపరుస్తాయని గుర్తుచేశారు. మూడేళ్లుగా పలు జిల్లాలలో మిరపపంటకు ఈ తెగుళ్ల ఆశించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో ఎక్కువగా పంటలకు ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్, మొవ్వకుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొన్నారు. రైతులు పంటలను సాగు చేసే ముందు పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన మూడు, నాలుగు రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చునని పేర్కొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబీస్ టీకా వేయించాలి



కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ స్వాతీదేవి



పెంపుడు కుక్కకు రేబీస్ టీకా వేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు



రేబీస్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ సీహెచ్ మల్లయ్య

అచ్చంపేట: పెంపుడు కుక్కలతో జాగ్రత్త వహించాలని, అనేక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. జూనోసిస్ డే అచ్చంపేటలో రేబీస్ వ్యాక్సినేషన్ నిర్వహించారు. కుక్కల్లో రేబీస్ లక్షణాలు రెండు రకాలుగా ఉంటాయని తెలిపారు. ఒకటి ఒంటరిగా ఒక మూలన కూర్చోవడం, రెండవది నోటి నుంచి సొంగ కార్చడం, చికాకుగా కనిపించడం, ఆహారం, నీరు తీసుకోకపోవడం, అరుపులో మార్పు కనిపిస్తుందని తెలిపారు. మొత్తం 30కి పైగా పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబీస్ టీకా

సత్తెనపల్లి: జంతువులపై అభిమానం చూపుతూ.. వాటి నుంచి వచ్చే వ్యాధులపై కూడా అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ టీకా శనివారం వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన పెంచే లక్ష్యంతో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. జంతువుల ద్వారా మానవులకు వచ్చే వ్యాధులకు నివారణ చర్యలు, చికిత్స విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బ్యాక్టీరియల్, వైరస్ ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. సంక్రమిత వ్యాధులనే జూనోసిస్ డిసీజెస్ అంటారన్నారు. ఈ సందర్భంగా మొత్తం 68 పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రోసూరు: జూనోసిస్ డే సందర్భంగా ఉచిత రేబీస్ వ్యాక్సినేషన్‌ను శనివారం నిర్వహించారు. క్రోసూరు, దొడ్లేరు పశు వైద్యశాలల్లో 40 పెంపుడు కుక్కలకు రేబీస్ టీకా వేసినట్లు మండల పశు వైద్యుడు డాక్టర్ సీహెచ్ మల్లయ్య తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఏటా క్రమం తప్పకుండా వాక్సిన్ వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార అహంతో దాడి చేస్తే..ప్రజా తిరుగుబాటు తప్పదు

టీడీపీకి సీపీఎం నాయకుల హెచ్చరిక

అమరావతి: పల్నాడు జిల్లా సీపీఎం నాయకుడు కామినేని రామారావుపై అధికార టీడీపీ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం అమరావతి మండల కార్యదర్శి బి.సూరిబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా రొంపిచెర్ల మండలం, పరగటిచర్ల గ్రామంలో స్థానిక టీడీపీ నాయకుడు దండోరా వేయించి, తన ఇంటి వద్ద సచివాలయ ఉద్యోగులు పింఛను ఇస్తే తీసుకోవాలని హుకుం జారీ చేయడం టీడీపీ అధికార అహంభావానికి నిదర్శనమన్నారు. అలా ఇంటికి వెళ్లిన పింఛనుదారుల్లో కొంతమందిని తమకు ఓటెయ్యలేదని ఇష్టారాజ్యంగా మాట్లాడి..మరుసటి రోజు రండి చూద్దాం అంటూ పంపించివేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని పింఛనుదారులు స్థానిక సీపీఎం నాయకుడు కామినేని రామారావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పింఛన్‌దారులతో కలిసి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇది సహించని స్థానిక టీడీపీ నాయకులు అధికార మదంతో మూకుమ్మడిగా ఇంటిలో పడుకుని ఉన్న 70 ఏళ్ల వృద్ధుడని కూడా చూడకుండా రామారావును కర్రలతో విచక్షణా రహితంగా కొట్టడం దారుణమన్నారు. దీనిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు దాడులు, అరాచకాలు ఆగకపోతే ప్రజలు తిరగబడటం ఖాయమన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కారంపై దృష్టి సారించాలని, ప్రశ్నించిన ప్రజాస్వామ్య వాదుల్ని, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపైన దాడులు చేస్తే పాలక ప్రభుత్వానికి పుట్టగతులుండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఎస్డీ మొహీద్దీన్ వలి పాల్గొన్నారు.

ప్రతి రోజు పిల్లలను బడికి పంపించాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): తల్లిదండ్రులు ప్రతి రోజూ పిల్లలను గైర్హాజరు కాకుండా పాఠశాలలకు పంపించాలని ఈసీసీఈ ప్రోగ్రాం జిల్లా కో–ఆర్డినేటర్ రవితేజ కోరారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామం రామాపురం కాలనీ ఎంపీపీఎస్ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో ఈసీసీఈ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కో–ఆర్డినేటర్ రవితేజ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా రెండు పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేశామన్నారు. అందులో భాగంగా పాఠశాలలో నిర్వహించే బోధన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తోకల అచ్చయ్య, ఉపాధ్యాయులు కల్యాణి, వేణుమాధవి, సతీష్, ముప్వ సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.